క్లుప్తంగా

కొనసాగుతున్న ఓటర్ల సర్వే

యద్దనపూడి: మండలంలో ఓటర్ల సర్వే కొనసాగుతోంది. ఆదివారం మండలంలోని గన్నవరం గ్రామంలో ఎమ్మార్వో వెంకటరెడ్డి, పూనూరు గ్రామంలో డిప్యూటీ తహశీల్దారు ఇంటింటికి తిరిగి ఓటర్ల సర్వే నిర్వహించారు. నకిలీ ఓట్లు స్థానికంగా నివాసం ఉండని ఓట్లపై విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా ఓటర్లు తగిన ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో వీఆర్వోలు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

27న అద్దంకి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

అద్దంకి రూరల్: ఈనెల 27 బుధవారం ఉదయం 11 గంటలకు స్థానిక కౌన్సిల్ హాలులో మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ ఎల్ ఎస్తేరమ్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులందరూ హాజరుకావాలని కోరారు.

స్పందనకు అధికారులు హాజరుకావాలి

యద్దనపూడి: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ప్రజావిజ్ఞప్తుల దినం స్పందన కార్యక్రమానికి అన్నిశాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని తహశీల్దారు వెంకటరెడ్డి సూచించారు. అలాగే స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించే స్పందనకు అన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్‌లు సోమవారం జరిగే సమావేశానికి హాజరుకావాలని ఎంపీడీవో కృష్ణకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎడతెరపి లేని వర్షం

బల్లికురవ: మూడురోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్‌లో బల్లికురవ నక్కబొక్కలపాడు, కొణిదెన, వేమవరం, మల్లాయపాలెం, ఉప్పు మాగులూరు, కొప్పెరపాలెం, వల్లాపల్లి, అంబడిపూడి, చెన్నుపల్లి గ్రామాల్లో సాగుచేసిన పంటలు శుక్రవారం నుంచి కురుస్తున్న వర్షానికి చీడపీడలు తొలగి జీవం పోసుకుని కళకళలాడుతున్నాయి. సాగరాయకట్టు పరిధిలోని మాగాణి భూముల్లో వరిసాగుకు బదులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని వ్యవసాయాధికారిణి ఎస్‌వీపీ కుమారి రైతులకు సూచించారు. ఇటీవల కురిసిన వర్షాల దుక్కులని పదునెక్కాయని, వరికి బదులుగా మొక్కజొన్న పొద్దుతిరుగుడు నువ్వు, పెసర సాగు చేసుకోవచ్చని తెలిపారు.

26, 27 తేదీల్లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

కారంచేడు: ఈనెల 26,27 తేదీల్లో కారంచేడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించనున్నట్లు ఎంఈవో ఎంవీ సత్యన్నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. 26వ తేదీన కుంకలమర్రు ఉన్నత పాఠశాల ఆవరణలో ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగే కాంప్లెక్స్‌లో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలలో 50 శాతం మంది ఉపాధ్యాయులు తప్పకుండా హాజరుకావాలన్నారు. స్వర్ణ హైస్కూల్‌లో కారంచేడు, చీరాల, చినగంజాం, వేటపాలెం మండలాలకు చెందిన ఉన్నత పాఠశాలల గణితం ఉపాధ్యాయులకు కూడా కాంప్లెక్స్ జరుగుతుందన్నారు. మండలంలో మిగిలిన 50 శాతం మంది ఉపాధ్యాయులకు ఈనెల 27వ తేదీన స్వర్ణ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగే కాంప్లెక్స్ సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

బీసీలు ఐకమత్యంతో ఉండాలి

చీరాల రూరల్: బీసీలు ఐకమత్యంతో ఉండాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో చీరాల నియోజకవర్గ స్థాయి బీసీ రౌండ్ టేబుల్ సమావేశం డాక్టర్ గుంటుపల్లి సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈసమావేశంలో రాజ్యాధికారం-బీసీల పాత్ర అనే అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశానికి బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బక్కా పరంజ్యోతి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీసీలలోని అన్ని కులాలవారు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. అంతేకాక బడ్జెట్‌లో బీసీలకు అధికంగా కేటాయింపులు చేపట్టి వారు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ముఖ్యంగా బీసీ కుల గణన చేపట్టి రాజ్యాంగం ప్రకారం బీసీలకు రావాల్సిన అన్ని హక్కులను అందించాలని సూచించారు. సమావేశంలో ఊటుకూరి వెంకటేశ్వర్లు, గొర్రెపాటి రవి కుమార్, శీలం వెంకటేశ్వర్లు, బక్కా జయరామి రెడ్డి, పుసులూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

30లోగా ఇంటర్ ప్రైవేట్ విద్యార్థులు ఫీజు చెల్లించాలి

మార్కాపురం టౌన్: ఇంటర్మీడియెట్ ఫెయిలైన విద్యార్థులు ఈనెల 30 తేదీలోగా ఫీజు చెల్లించాలని స్థానిక సాధనా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ.. ఈ ఏడాది ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో ఫెయిలైన విద్యార్థులు 30వ తేదీలోగా ఫీజు చెల్లిస్తేనే 2024 మార్చిలో పబ్లిక్ పరీక్షలకు అర్హులవుతారని స్పష్టం చేశారు. సాధారణంగా ఇప్పటి వరకు రెగ్యులర్ విద్యార్థులతోపాటు ప్రైవేట్ విద్యార్థులకు కలిపి ఒకే తేదీని నిర్ణయించేవారని, ఈ ఏడాది నుంచి విడివిడిగా ఫీజు చెల్లించాలని, విద్యార్థులు గమనించాలని సూచించారు.

గంగ ఒడికి చేరుకున్న గణనాయకుడు


నక్కబొక్కలపాడులో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు


వేటపాలెం నుంచి సముద్రానికి తరలుతున్న గణపతి విగ్రహాలు


జాగర్లమూడిలో ట్రాక్టర్‌పై ఊరేగుతున్న వినాయకుడు


చీరాల: లక్ష్మీ గణపతి హోమాన్ని నిర్వహిస్తున్న భక్తులు


చీరాల: పూలలతో అలంకరించిన వినాయకుడు


వేటపాలెంలో వినాయకుడికి హారతి ఇస్తున్న మహిళలు


కారంచేడులో నిమజ్జనం కోసం చీరాల బయలుదేరిన గణనాథుడు


మేదరమెట్ల తూర్పుపాలెంలో విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు

● ఉత్సాహంగా గణపతి నవరాత్రులు

యద్దనపూడి/మార్టూరు/కారంచేడు/చినగంజాం/: ఆరురోజులుగా పూజలందుకున్న వినాయకుడు ఏడో రోజు నిమజ్జనానికి గంగఒడికి తరలివెళ్లాడు. నిమజ్జనం సందర్భంగా యువకులు నృత్యాలు చేసుకుంటూ, రంగులు చల్లుకుంటూ నిమజ్జనం కోసం వాడరేవు సముద్రతీరానికి తరలి వెళ్లారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండి పంటలు బాగా పండాలని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ జిల్లా కార్యదర్శి తమ్మా అమ్మిరెడ్డి ఆధ్వర్యంలో జాగర్లమూడిలో వైఎస్సార్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించి నిమజ్జనానికి చీరాల ఓడరేవుకు తరలి వెళ్లారు.

➤ మార్టూరు శివాలయం సమీపంలోని విగ్రహాన్ని మేళతాళాలతో వినాయకుడి ఊరేగింపు నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. స్థానిక పొగాకు గోడౌన్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాన్ని మహిళా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి నిమజ్జనానికి తరలించారు.

➤ కారంచేడు యజ్ఞశాలపేటకు చెందిన యూత్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజల అనంతరం చీరాల వాడరేవు సముద్రపు ఒడ్డున బొజ్జ గణపయ్యను నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ, ప్రసాదాలు కమిటీ సభ్యులు పంపిణీ చేశారు. కారంచేడు, స్వర్ణ, కుంకలమర్రు, కొడవలివారిపాలెం, దగ్గుబాడు, ఆదిపూడి గ్రామాల నుంచి వినాయక నిమజ్జన కార్యక్రమాలు జరిగాయి.

జైబోలో గణేష్ మహరాజ్ కీ జై..

మేదరమెట్ల/బల్లికురవ: వినాయక చవితి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన గణనాథులను ఏడో రోజు ఆదివారం నిమజ్జనానికి తరలిస్తున్నారు. కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల తూర్పుపాలెంలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన గణనాథుడిని మేళతాళాలు, చిన్నారుల కేరింతలు, బాణాసంచాతో కోలాహలంగా నిమజ్జన వేడుకలు నిర్వహించారు.

➤ బల్లికురవ మండలం కొణిదెన, నక్కబొక్కలపాడు, వేమవరం, కొత్తమల్లాయపాలెం, గుంటుపల్లి, పెద అంబడిపూడి, కొమ్మినేనివారిపాలెం, ముక్తేశ్వరం గ్రామాల్లో ఏర్పాటు చేసిన నిలువెత్తు గణనాథులను స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేశారు.

చీరాల టౌన్/వేటపాలెం: వినాయక నిమజ్జనం సందర్భంగా చీరాల, వేటపాలెం సముద్ర తీరాలకు గణనాథులు పోటెత్తుతున్నారు. గణేష్ మహారాజ్‌కీ జై అంటు నినాదాలతో గణపతి విగ్రహాలను నిమజ్జనానికి తరలిస్తున్న యువకులు ఉత్సాహంగా ఊరేగింపుగా తరలి వెళ్లారు.

చీరాల అర్బన్: చీరాల కొత్తపాలెంలో గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పందిరి వద్ద వినాయక ప్రతిమకు మల్లెపూలు, కనకాంబరాలతో అలంకారం చేశారు. అలానే కోలాట భజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అలానే పట్టణంలోని జక్కావారివీధిలోని విజయగణపతి మందిరం వద్ద 25వ వార్షికోత్సం సందర్భంగా లక్ష్మీగణపతి హోమాన్ని నిర్వహించారు.


కొనిదెనలో మిట్టమీద ఏర్పాటుచేసిన గణనాథుడు


మార్టూరులో నిమజ్జనంలో సందడి చేస్తున్న చిన్నారులు


వాడరేవు తీరంలో గణపయ్యను నిమజ్జనం చేస్తున్న భక్తులు


చీరాల: భక్తులతో కిక్కిరిసిన వాడరేవు తీరం

మళ్లీ జగన్ సీఎం కావాలని పాదయాత్ర


జిలానిబాషాను సత్కరిస్తున్న నాయకులు

మార్టూరు: మరోమారు సీఎంగా వైఎస్ జగన్ మోహనరెడ్డి గెలుపే లక్ష్యంగా మార్కాపురం నుంచి ఇచ్చాపురం వరకు పాదయాత్ర చేస్తున్న షేక్ జిలాని బాషాకు మార్టూరు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం సాయంత్రం ఘన స్వాగతం పలికారు. మార్కాపురానికి చెందిన షేక్ జిలానిబాషా వైఎస్ జగన్ రెండో సారి ముఖ్యమంత్రిగా గెలుపొందటం కోసం పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా రాయలసీమ పాదయాత్ర పూర్తి చేసుకొని పల్నాడు జిల్లాలోకి వెళ్లే క్రమంలో ఆదివారం సాయంత్రం మార్టూరు వచ్చారు. విషయం తెలుసుకున్న మండల కన్వీనర్ పఠాన్ కాలేషావలి, ఎస్సీ సెల్ కన్వీనర్ అట్లూరి సుకుందరావు, జిల్లా వక్ఫ్ బోర్డు కార్యదర్శి గడ్డం మస్తాన్‌వలి జిలానిబాషాను సాదరంగా ఆహ్వానించి పూలమాలతో సత్కరించి పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు సులేమాన్, ఎంపీటీసీ కరిముల్లా కొండమస్తాన్, చిమ్మిరిబండ శ్రీను,డబ్బాల శ్రీను,మస్తాన్ వలి, బాజీ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయం


షుగర్ వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు


స్వర్ణలో మాట్లాడుతున్న ఎంపీపీ వాసుబాబు

చీరాల టౌన్: సమాజ సేవ, ఆధ్యాత్మిక, ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించి ప్రతి ఒక్కరికి సేవ చేయడమే శ్రీరామానంద సరస్వతి ట్రస్ట్ లక్ష్యమని ఆశ్రమం మేనేజర్ నారాయణం సురేష్ తెలిపారు. ఆదివారం మండలంలోని వాడరేవు గ్రామంలోని రామానంద సరస్వతి ఆశ్రమంలో నిర్వహించిన ఉచిత మెగా షుగరు వ్యాధి శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ ఉచిత సుగరు వైద్య శిభిరానికి హాజరైన 493 మంది వ్యాధిగ్రస్తులకు డాక్టర్ రాజ రాజేశ్వరి, డాక్టర్ పేట శ్రీకాంత్, డాక్టర్ సుధాకర్, డాక్టర్ లలిత ప్రకాష్‌లు వైద్య పరీక్షలు నిర్వహించి నెలకు సరిపడా మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఉపాధ్యక్షుడు కృష్ణారావు, శంకరరావు, సురేష్, కామేశ్వరరావు, గోపాల్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ(కారంచేడు): గ్రామాల్లో ట్రస్టుల ద్వారా నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను కూడా పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు అన్నారు. ఆదివారం మండలంలోని స్వర్ణ గ్రామంలో కేళం రామకోటేశ్వరరావు చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. డాక్టర్ పీవీ నాగరాజు, డాక్టర్ కేళం దీప్తిలు సుమారు 550 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. బీపీ, షుగర్‌లతో పాటు, ఈసీజీ, స్త్రీలు, గైనిక్ సమస్యలపై పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

అద్దంకి రూరల్: ఈనెల 27న నిర్వహించనున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ పోస్టర్‌ను యూటీఎఫ్ జిల్లా నాయకులు ఆదివారం స్థానిక కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలకు పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. అద్దంకిలో 27న స్వర్ణోత్సవ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు, జిల్లా అడిట్ కమిటీ కన్వీనర్ జగన్నాథం బాబురావు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామారావు, బీ.పూర్ణచంద్రరావు, గౌరవాధ్యక్షుడు ఎస్‌కె మస్తాన్‌వలి, నాయకులు సోమేపల్లి హనుమంతరావు, బీ. చంద్రశేఖర్, గోగుల కోటేశ్వరరావు, ఎస్‌కె అన్వర్ బాషా, దేవరకొండ హనుమంతరావు, పాల్గొన్నారు.

వర్షానికి పొంగిన వాగులు

గిద్దలూరు రూరల్: నల్లమల అటవీ ప్రాంతంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షం కారణంగా మండలంలోని పలు వాగులు ఉప్పొంగాయి. నల్లమల నుంచి వచ్చే వర్షపు నీటి కారణంగా దిగువమెట్ట సమీపంలో గల ఎగువ బీమలింగేశ్వరస్వామి ఆలయం వద్ద గల సగిలేరు వాగు, ఎనమలేరు, ఉప్పువాగులకు వర్షపు నీరుతో జలకలగా మారింది. కొండపేట ఆంజనేయస్వామి ఆలయం వెనుకాల ఉన్న సగిలేరువాగు పారడంతో అవతలి వైపు ఉన్న జగనన్న కాలనీలోకి వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వాగులు పారుతుండటంతో స్థానికులు పెద్ద ఎత్తున తరలివచ్చి తిలకించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో విద్యుత్ లైన్ల అత్యవసర మరమ్మతుల దృష్ట్యా సోమవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు కొండేపల్లి రోడ్డు, కంభం రోడ్డు, ఎల్‌ఐసీ ఆఫీసు, గవర్నమెంటు హాస్పిటళ్లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ డీఈ షియానాయక్ తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలని ఆయన కోరారు.

గ్రామ దేవతలకు పూజలు


ఈర్లగంగమ్మ అమ్మవారు

బల్లికురవ: భాద్రపద మాసం రెండో ఆదివారం సందర్భంగా మండలంలో గ్రామదేవతలకు ప్రత్యేక పూజలతో తమ మొక్కులు తీర్చుకున్నారు. బల్లికురవ, గుంటుపల్లి, కొత్తపాలెం,వల్లాపల్లి, అంబడిపూడి, కొణిదెన, కొండాయపాలెం గ్రామాల్లో గ్రామ దేవతలైన పోలేరమ్మ, మహాలక్ష్మమ్మ, అంకమ్మ ఆలయాల్లో భక్తులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నివేదించారు. స్థానిక ఈర్లకొండ, ఈర్లగంగమ్మ ఆలయంలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారి సన్నిధానం వద్ద పొంగళ్లు పెట్టి నివేదనతో పాడి పంటలతో తమ కుటుంబాలు చల్లగా చూడాలని ప్రార్థించారు. ఈర్ల గంగమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

ఆరోగ్య సురక్షతో ఇంటింటి సర్వే


ఇంటి యజమానికి టోకెన్ అందిస్తున్న ప్రత్యేకాధికారి కాశీవిశ్వనాథ్

వేటపాలెం: మండల పరిధిలోని పాపాయిపాలెం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్యసిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించారు. సర్వేను గ్రామ ప్రత్యేకాధికారి ఐ కాశీవిశ్వనాథ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబంలోని వారి ఆరోగ్య సమస్యలను తెలుసుకొని పరీక్షలు అవసరమైన వారికి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆరోగ్య సమస్యలు గుర్తించిన వారికి టోకెన్లు అందజేస్తున్నట్లు తెలిపారు. అక్టోబర్ 5న జగనన్న ఆరోగ్య సురక్ష కింద మెగా హెల్త్ క్యాంప్ నిర్వహిస్తారని తెలిపారు. క్యాంపులో నలుగురు నిష్ణాతులైన ప్రత్యేక వైద్య నిపుణులు సేవలు అందిస్తారని తెలిపారు. అవసరమైతే ప్రత్యేక పరీక్షలు నిర్వహించి శస్త్రచికిత్సలకు సిఫార్సు చేస్తారని తెలిపారు.

పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు


భక్తులకు దర్శనమిస్తున్న పోలేరమ్మ తల్లి

మార్కాపురం టౌన్: పట్టణ శివారులో వెలసిన అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు చేసి కుంకుమార్చన, అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు వండి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది శ్రీధర్‌రెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

వాసవీ క్లబ్‌కు సేవా పురస్కారాలు

చీమకుర్తి: సంతనూతలపాడులోని వాసవీ క్లబ్, మహిళా క్లబ్ తరఫున నిర్వాహకులు గతేడాది పాటు అందించిన సేవా కార్యక్రమాలకు వాసవీక్లబ్ రీజియన్ స్థాయిలో సేవా అవార్డులు అందించారు. ఆదివారం ఒంగోలులోని వైశ్యభవన్‌లో వాసవీ రీజియన్ పరిధిలోని 18 క్లబ్‌ల ఆధ్వర్యంలో డాన్ టు డెస్క్ కార్యక్రమంలో భాగంగా సంతనూతలపాడులో మెగా మెడికల్ క్యాంప్‌తో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు ఉత్తమ అవార్డులు ప్రకటించారు.

కారంచేడు రైల్వేగేటు మూసివేత

చీరాల రూరల్: జనసంచారం, వాహనాలతో నిత్యం రద్దీగా ఉండే కారంచేడు రైల్వేగేటును రైల్వే అధికారులు మూడు రోజులు పాటు తాత్కాలికంగా మూసివేశారు. శనివారం నుంచి గేటును తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు గేటుకు నోటీసులు కూడా అతికించారు. రైల్వే అధికారులు నూతనంగా ఏర్పాటు చేసిన మూడో లైన్‌పై ట్రాక్ పనులను ముమ్మరంగా చేయిస్తున్నారు. నిత్యం జనసంచారంతో పాటు వాహనాలతో రద్దీగా ఉండే కారంచేడు రైల్వేగేటు మూగబోయింది. కారంచేడు నుంచి పట్టణంలోనికి వాహనాలు వెళ్లాలన్నా, పట్టణంలో నుంచి కారంచేడు వైపు వెళ్లాలన్నా ఈ రైల్వేగేటు ఎంతో అనువుగా ఉంటుంది. ఈ గేటును మూసివేయండంతో కారంచేడు నుంచి పేరాల వైపు వెళ్లేవారు రైల్వే ఓవర్ బ్రిడ్జి ఎక్కి పేరాల వెళ్తున్నారు. దీని వలన ఎంతో సమయం వృథా అవుతుందని వాహనదారులు చెప్పున్నారు. అలానే కారంచేడు రైల్వేగేటు ఆవల ఐదారు మున్సిపల్ వార్డులకు చెందిన ప్రజలు నివాసముంటున్నారు. వారు కూడా నిత్యం ఈ గేటు దాటుకుని పట్టణంలోనికి రావాల్సిందే విద్యార్థులతో పాటు ఉద్యోగాలకు వెళ్లేవారు, కూలి పనులకు వెళ్లే కూలీలు ఈ గేటును ఆశ్రయించాల్సిందే. రైల్వే అధికారులు మూడవ లైన్ పనులు త్వరితగతిన పూర్తిచేస్తే ట్రాఫిక్ సమస్యల నుంచి బయటపడతామని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

బాధిత కుటుంబానికి స్నేహితుల సాయం


నాగరాజు కుటుంబానికి ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలు అందిస్తున్న స్నేహితులు

చినగంజాం: ఇటీవల గుండెపోటుతో మరణించిన మండలంలోని సోపిరాల గ్రామానికి చెందిన నున్నా నాగరాజు కుటుంబానికి అతని చిన్ననాటి స్నేహితులు ఆర్థిక సాయమందించి ఆదుకున్నారు. చినగంజాం జడ్పీ ఉన్నత పాఠశాలలో 2002లో నాగరాజు పదవతరగతి పూర్తిచేయగా అతని మృతితో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న అతని కుటుంబ పరిస్థితిని అతనితో పాటు చదివిన చిన్ననాటి స్నేహితులు ఈ విషయాన్ని గుర్తించారు. ఆదివారం నాగరాజు ఇంటికి స్వయంగా వెళ్లి పోస్టాఫీసులో కేవీపీ పథకం ద్వారా రూ 1.38 లక్షలు ఫిక్స్‌డ్ చేసి కుటుంబ సభ్యుల సమక్షంలో అతని తల్లి నున్నా కోటేశ్వరమ్మకు స్వయంగా అందజేశారు. కార్యక్రమంలో నాగరాజు స్నేహితులు దినేష్, శ్రీమన్నారాయణ, శ్రీనివాసరెడ్డి, శ్రీరాములు రెడ్డి, రంగనాయకులు, పవన్ పాల్గొన్నారు.

బైకును ఢీకొన్న కారు, ఇద్దరికి గాయాలు


ప్రమాదంలో బైకును ఢీకొన్న కారు

మేదరమెట్ల: రోడ్డు దాటుతున్న బైక్‌ను కారు ఢీకొట్టడం ఓ ఇద్దరికి గాయాలయ్యాయి. ఈఘటన వెంకటాపురం క్రాస్‌రోడ్డు వద్ద ఆదివారం చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. చిలకలూరిపేట వైపు నుంచి మేదరమెట్ల వైపుకు వెళ్తున్న కారు వెంకటాపురం క్రాస్‌రోడ్డు వద్దకు రాగానే రాణింగవరం నుంచి వెంకటాపురం వెళ్లేందుకు రోడ్డు దాటుతున్న మోటారు బైకును ఢీ కొంది. ఈప్రమాదంలో బైకుపై ఉన్న ఇరువురికి గాయాలు కాగా 108వాహనంలో అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులు అద్దంకి మండలం నాగులుపాడు గ్రామానికి చెందిన మెండితోక దాసు, దాసరి కోటయ్యగా తెలిపారు.